క్లుప్తంగా

పార్వతీదేవికి సారె



బిక్కవోలులో అమ్మవారికి సారె సమర్పించిన భక్తులు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో కొలువైన పార్వతీదేవికి గ్రామస్తులు 300 కేజీల సారె అమ్మవారికి సమర్పించారు. శ్రావణమాసం మూల నక్షత్రం పురస్కరించుకుని భారీ ఎత్తున్న మహిళలు పసుపు, కంకుమ, కాజా, లడ్డు వంటి పలు రకాల పండ్లు, గాజులు అమ్మవారికి సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం సారెతో గ్రామోత్సవం నిర్వహించారు.

చదువుపై ఏకాగ్రత అవసరం

బిక్కవోలు: చదువుపై ఏకగ్రత అవసరమని కాకినాడ ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ చైతన్య మురళి అన్నారు. బుధవారం మండలంలోని ఇలపల్లి ఉన్నత పాఠశాలలో నవదోయం 2.0 కార్యక్రమం నిర్వహించారు. చదువు ప్రాముఖ్యతను విద్యార్థులకు ఆయన వివరించారు. బాల్య వివాహం నిర్మూలించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని విద్యార్థులు తగ్గించుకోవాలన్నారు. జీవన సరళి వ్యక్తిగత అభివృద్ధి చెందుతున్నారు. పర్యావరణంపై విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో రంగంపేట ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సుధా, పాఠశాల హెచ్ఎం పప్పు శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేయిస్తున్న హెచ్ఎం

రంగంపేట: బాల్యం నుంచి కంటి రక్షణపై అవగాహన పెంచుకొని తగు జాగ్రత్తలు పాటించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పార్థసారథి సూచించారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆప్తల్మిక్ ఆఫీసర్ ఇందిర ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర కంటి పరీక్షల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అన్ని ఇంద్రియాల్లో కంటే కన్ను చాలా ప్రధానమైనదని, అన్ని వేళలా జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని చెప్పారు. ఈ సందర్భంగా ఇందిర 329 మంది బాలబాలికలకు నేత్ర వైద్య పరీక్షలు చేసి, 15 మంది విద్యార్థులకు కళ్లజోళ్లు అవసరముందని, ప్రతిరోజూ కళ్లజోళ్లు ధరించాలని చెప్పారు. పలు జాగ్రత్తలను విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పీటీలు వేంకటేశ్వర్లు, లక్ష్మి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ పరీక్షల శిబిరం ప్రారంభం

రాజానగరం: క్యాన్సర్ వ్యాధిని అందరూ ప్రాణాంకత వ్యాధిగా చూస్తారని, దానిని ముందుగా గుర్తించి సరైన వైద్యం అందిస్తే ఏమాత్రం ప్రాణాంతకం కాదని ఎస్‌బీ డీఎస్పీ రామకృష్ణ అన్నారు. స్థానిక అన్నదాన సత్రం కల్యాణ మండపంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంకు చెందిన ఆత్మబంధువులం సేవా సంఘం సహకారంతో జరిగిన ఈ వైద్య శిబిరంలో 59 మంది పురుషులు, 39 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ వీరయ్య గౌడ్, ఎస్సైలు నాగార్జున, అలెగ్జాండర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలి

పెదపూడి: రైతులు చెల్లించే ఇన్సూరెన్స్ ప్రీమియంను 15వ తేదీలోపు ఇన్సూరెన్స్ పోర్టల్‌లో రైతుల వివరాలు నమోదు చేయాలని వ్యవసాయశాఖ కాకినాడ ఏడీ దుర్గాలక్ష్మి అన్నారు. జి.మామిడాడలో రైతు సేవా కేంద్రం, పైన గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని ఆమె బుధవారం సందర్శించారు. పలు రికార్డులు, ఎరువుల నిల్వలు పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ, రైతులు గ్రామాల్లో జరుగుతున్న ఈ క్రాప్ నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచడానికి అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సత్య ప్రసాద్, పీఏసీఎస్ సీఈఓ సత్యసాయి బాబా, వీఏఏ పి.అశ్వక్, రైతులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ

అనపర్తి: బైక్‌ను ట్యాంకర్ లారీ ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయని అదనపు ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు. ద్వారపూడికి చెందిన గునిపల్లి సాయిసురేంద్ర వాళ్ల అమ్మమ్మను అనపర్తిలోని ఆస్పత్రికి బైక్‌పై తీసుకుని అనపర్తి వస్తుండగా వెనుక వస్తున్న ట్యాంకర్ వేగంగా ఢీకొట్టడంతో ఇరువురు కింద పడ్డారు. స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం సాయి సురేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై తెలిపారు.

భవనాలు లేక.. భారం

- అంగన్‌వాడీలకు భారమవుతున్న అద్దె భవనాలు
- పెనుభారంగా మారుతున్న ధరలు
- సిబ్బందిపై పడుతున్న మెనూ భారం



అంగన్‌వాడీ కేంద్రం

రాజానగరం: ప్రభుత్వం చెల్లించే నిధులతో అంగన్‌వాడీ కేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహించలేక ఆయా కేంద్రాల కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారు. పెరుగుతున్న నిర్వహణ ఖర్చులు వారి పాలిట పెనుభారంగా తయారవుతున్నాయి. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో భవనాలకు అద్దె కడుతున్నా, కేంద్రాల్లోని పిల్లలకు వడ్డించే ఆహారానికి సంబంధించిన ఖర్చులు కూడా పెరిగిపోతున్న నేపథ్యంలో కొంతకాలంగా అంగన్‌వాడీ కేంద్రాలు మోయలేని భారంగా మారయని వాపోతున్నారు. పాలకులకు తరచు తమ సమస్యలను విన్నవించుకుంటూ..పెరుగుతున్న భారాన్ని తొలగించాలని వేడుకుంటున్నారు.

అద్దెకు భవనాలు దొరకక

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమకూర్చే నిధులతో రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు కొన్నిచోట్ల సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఇందుకోసం గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో భవనానికి నెలకు రూ. 2 వేలు, పట్టణాలలో రూ.4 వేలు అద్దె నిమిత్తం ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది. అయితే ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో సైతం నెలకు రూ.5 వేలకు తక్కువ ఇల్లు దొరకడం లేదు. దీంతో ప్రభుత్వం చెల్లించే అర కొర అద్దెకు భవనాలు దొరకక, అరుగులు మీదనే కాలం గడిపేస్తున్నారు. ఈ సమయంలో ఆయా కేంద్రాల నిర్వహణకు సంబంధించిన పరికరాలను దాచుకోవడం వారికి పెద్ద సమస్యగా మారుతుంది.

సిబ్బందిపై పడుతున్న ఆర్థిక భారం

స్థానిక ఐడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 311 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. మండలాల వారీగా చూస్తే రాజానగరంలో వంద, రాజమహేంద్రవరం రూరల్‌లో 129, కడియంలో 82 కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 254 కేంద్రాలను అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. ఒక్కో కేంద్రానికి ప్రభుత్వం నుంచి వచ్చే రూ.2 వేలకు ఆయా కేంద్రానికి చెందిన కార్యకర్త, ఆయాలు చెరో కొంత సొమ్మును వేసుకొని, భవన యజమానికి అద్దె చెల్లిస్తున్న సంఘటనలు కూడా ఉన్నాయి. ఈ తరుణంలో గోరుచుట్టుపై రోకలిపోటన్నట్టుగా అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీస్కూలు పిల్లలకు అందించే ఆహారం తయారీకి అయ్యే ఖర్చులు నిర్వాహకులపై మరింత ఆర్థిక భారాన్ని మోపుతున్నాయి.

ధరలు పెరిగిపోతున్నా..

ఆహారం తయారీ కోసం నిత్యం కూరగాయలు, నిత్యవసర వస్తువులను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇందుకు ఒక్కో చిన్నారికి బియ్యం 75 గ్రాములు, వంట నూనె 5 గ్రాములు, కందిపప్పు 15 గ్రాముల చొప్పున చెల్లిస్తుంటారు. కూరగాయలు, పోపు సామాన్ల నిమిత్తం ఒక రూపాయి 50 పైసలు, వంట గ్యాస్ నిమిత్తం 50 పైసలు మంజూరు చేస్తారు. పోపు సామాన్లతోపాటు కూరగాయల ధరలు పెరిగిపోతున్నా వీటిలో మాత్రం మార్పులు ఉండటం లేదు. అంతేకాక వంట గ్యాస్ సిలిండర్ ధర పెరిగినప్పటికీ అందులోనూ ఒక్కో విద్యార్థికి ఇచ్చేది 50 పైసలే. ప్రభుత్వ నుంచి ప్రతి నెలా కార్యకర్తకు రూ.11,500 ఆయాకు రూ.7 వేలు వేతనంగా చెల్లిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులతో సమానంగా విధులు నిర్వర్తించే అంగన్‌వాడీ సిబ్బందికి ఈ వేతనాలు తప్ప మరొక ఆదాయం ఉండదు. కేంద్రాల నిర్వహణ కోసం పడుతున్న అదనపు ఆర్థిక భారాన్ని మోస్తూ, కాలం వెల్లదీస్తున్నామని అంగన్వాడీలు వాపోతున్నారు. మెనూ ప్రకారం ప్రీ స్కూలు పిల్లలకు ఆహారం వండి వడ్డించాలి. 2022లో అప్పటి ధరలను బట్టి రూపొందించిన మెనూ ప్రకారమే నేటికీ నిధులు మంజూరు చేస్తున్నారని అంటున్నారు. ప్రస్తుతం ఉన్న నిత్యావసరల ధరలను బట్టి మెనూలో మార్పులు తీసుకురావాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో సిబ్బందిపై పడుతున్న ఆర్థిక భారం గురించి సిబ్బంది ఇచ్చే విజ్ఞాపనలను ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు నివేదిక ద్వారా తెలియజేస్తున్నాం. ప్రస్తుతం ఒక్కో విద్యార్థికి వారానికి రూ.500 వరకు భారం పడుతుంది. ప్రస్తుతం ఉన్న ధరలను బట్టి మెనూలో మార్పులు చేయాలి.

– టి.నాగమణి, సీడీపీఓ, ఐసీడీఎస్ ప్రాజెక్ట్, రాజానగరం

రైతులకు న్యాయం చేస్తాం

- డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ దుర్గారెడ్డి
- సొసైటీ తాళం తీసిన రైతులు
- నెలాఖరులోగా విచారణ పూర్తి

సీతానగరం: వెదుళ్లపల్లి పీఏసీఎస్ రైతులకు న్యాయం చేస్తామని డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ కనకదుర్గా రెడ్డి రైతులకు బుధవారం హామీ ఇచ్చారు. వెదుళ్లపల్లి సొసైటీకి మంగళవారం రైతులు తాళం వేయడంతో డీఆర్ కనక దుర్గారెడ్డి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ కృష్ణ మోహన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మధుబాబు, సీఈవో శివరామ కుమారి సొసైటీకి తరలివచ్చారు. సొసైటీకి వేసిన తాళం తీయాలని, ఎరువులు, రేషన్ సరకులు పంపిణీ చేయాలని రైతులకు చెప్పడంతో తాళం తీశారు. అనంతరం రైతులు పెందుర్తి రాజా, మరిపిండి సోమరాజు, ఆచంట రఘురామ్, కొత్తపల్లి దోసాలరావు, మద్దుకూరి వీర్రాజు, సానిపల్లి సత్యనారాయణ, శ్రీనివాస్ సొసైటీలోని అధికారులతో చర్చలు జరిపారు. తీసుకున్న రుణం ఓవర్ డ్యూ అవ్వడంతో కవల శ్రీనివాస్ చెల్లించిన రుణ నగదు తానే వాడుకున్నానని, దానిని చెల్లిస్తానని సస్పెండైన సీఈవో సురేంద్ర లెటర్ ఇవ్వడమేంటని నిలదీశారు. తాము రుణాలు చెల్లించామని, సస్పెండైన సీఈవో పై విధంగా లెటర్ ఇస్తానంటున్నాడని, దానిని తీసుకొని తమ పట్టాదారు పాస్‌బుక్‌లు తక్షణమే అందించాలని రైతులు డిమాండ్ చేశారు. దీనిపై డీఆర్ స్పందిస్తూ తీసుకున్న రుణం ఓవర్ డ్యూ అయితే చైర్‌పర్సన్ అర్హత లేదన్నారు. మండలంలో రాపాక, వెదుళ్లపల్లి సొసైటీలకు మాత్రమే త్రిసభ్య కమిటీలు వేయలేదన్నారు. వాటికి పర్సన్ ఇన్‌చార్జ్‌లు కొనసాగుతారని తెలిపారు. సొసైటీలో జరిగిన లక్షలాది సొమ్ము గల్లంతుపై విచారణ సత్వరమే పూర్తి చేసి ఈనెలాఖరకు రుణాలు చెల్లించిన 35 మంది రైతులకు న్యాయం చేస్తానని లిఖిత పూర్వక హామీ ఇచ్చారు. ఈ నెలాఖరుకు రుణాలు చెల్లించిన రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని రైతులు కోరారు.

వైఎస్సార్ సీపీ సమన్వయ కమిటీ అధ్యక్షుడిగా కరెడ్ల



కరకుదురు పార్టీ సమన్వయకర్తగా వెంకన్నబాబు బాధ్యతలు

అనపర్తి: పెదపూడి మండలం కరకుదురు గ్రామ వైఎస్సార్ సీపీ సమన్వయ కమిటీ అధ్యక్షుడిగా వైస్ ఎంపీపీ కరెడ్ల వెంకన్న బాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ, గ్రామస్థాయిలో పార్టీని మరింత బలంగా నిలబెట్టేందుకు, కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంపొందించేందుకు కరెడ్ల వెంకన్నబాబు నేతృత్వంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పెదపూడి మండల కన్వీనర్ గుత్తుల రమణ, అనపర్తి నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంబత్తుల చంటి, ఎంపీటీసీ సభ్యుడు పేపకాయల వెంకటరమణ, రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి రావు తదితరులు పాల్గొని కొత్తగా బాధ్యతలు చేపట్టిన అధ్యక్షుడిని అభినందించారు.

రమేష్ యాదవ్‌పై దాడి అమానుషం



కొండపల్లి దుర్గారావు

కోరుకొండ (రాజానగరం): వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు రమేష్ యాదవ్‌పై జరిగిన దాడి అమానుషమైన చర్య అని జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కొండపల్లి దుర్గారావు తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలోని బీసీ వర్గీయుల మనోభావాలను దెబ్బతీసే విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. ఈ దాడికి పాల్పడిన వ్యక్తులు ఎవరనేది తెలుసుకొని, అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే సంఘపరంగా ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఎస్సీలపై రాజకీయ కుట్ర



అనపర్తి ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న రత్నాకర్ తదితరులు

అనపర్తి: ఎస్సీ వర్గీకరణ ముసుగులో దేశవ్యాప్తంగా ఎస్సీలపై రాజకీయ కుట్ర జరుగుతుందని మాల మహానాడు అండ్ రాక్స్ జాతీయ అధ్యక్షుడు ఆర్ఎస్ రత్నాకర్ అన్నారు. బుధవారం అనపర్తి ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. వాటాల కోసం దేశవ్యాప్తంగా ఎస్సీ లిస్టులో ఉన్న 1,108 ఎస్సీ కులాలు, నిరంతరం ఘర్షణకు చచ్చే విధంగా ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కుట్ర పన్నారన్నారు. దీనికి అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలుపుతున్నాయని ఎన్నికల్లో రేవంత్ రెడ్డి, చంద్రబాబు ఇచ్చిన హామీలను పక్కదోవ పట్టించేందుకే ఎస్సీ వర్గీకరణను తెరపైకి తీసుకువచ్చారన్నారు. తెలుగు రాష్ట్రాల్లో మాల సామాజికవర్గాన్ని అన్ని రాజకీయ పార్టీలు లక్ష్యంగా చేసుకుని కుట్రలు చేస్తున్నాయన్నారు. వ్యవసాయ చట్టాన్ని వెనక్కి తీసుకునేంత వరకు ఢిల్లీ వేదికగా రైతులు ఏ విధంగా పోరాటం కొనసాగించారో, అదే తరహాలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. శాంతియుతంగా నిరంతర పోరాటం చేస్తే తప్ప సమస్యకు పరిష్కారం దొరకదన్నారు.

ఉద్యోగుల సమావేశం

ధవళేశ్వరం: రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమంలో భాగంగా బుధవారం ధవళేశ్వరం పోలవరం హెడ్‌వర్క్స్ సర్కిల్ కార్యాలయంలో ఉద్యోగులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ వీడియో సందేశాన్ని తిలకించారు. కార్యక్రమంలో నాయకులు ఎన్‌వీఎస్ రాజు, వైశాంతి రాజు, జె.రాజారావు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాల ర్యాలీ



కొమరిపాలెంలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు

బిక్కవోలు: తల్లి పాలు నవజాత శిశువుకు వ్యాధి నిరోధక టీకా లాంటివని మాజీ జెడ్పీటీసీ పడాల వెంకటరామారెడ్డి అన్నారు. బుధవారం కొమరిపాలెంలో తల్లిపాల వారోత్సవాల్లో ఆయన మాట్లాడుతూ, తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని, ఆరు మాసాల వరకు శిశువుకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ మాట్లాడుతూ, తల్లిపాలు ఇవ్వని మహిళలు రొమ్ము కాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందన్నారు. నేటి కాలంలో చాలా మంది తల్లులు బిడ్డకు పాలిస్తే అందం తరిగిపోతుందనే ఉద్దేశంతో పాలు ఇవ్వడం మానేస్తున్నారన్నారు. అనంతరం ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వాసంశెట్టి రవికుమార్, దార్వంపూడి వెంకటరెడ్డి, అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలు తాగించాలి

పెదపూడి: తల్లి పాలు బిడ్డకు విధిగా తాగించాలని ఐసీడీఎస్ కాకినాడ అర్బన్ ప్రాజెక్టు సంపర సెక్టార్ సూపర్ వైజర్ చింతా శ్రీపద్మావతి అన్నారు. చింతపల్లి, వేంద్ర గ్రామాల్లో బుధవారం ప్రపంచ తల్లిపాలు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తల్లిపాలలో రోగనిరోధక శక్తి మెండుగా ఉంటుందన్నారు. బిడ్డ పుట్టిన గంట నుంచి బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని దాని విశిష్టత, తల్లిపాలు ప్రాధాన్యత వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ నాయకులు తదిరులు పాల్గొన్నారు.

ఘనంగా జక్కంపూడి జయంతి



పెదపూడిలో జక్కంపూడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సూర్యనారాయణరెడ్డి



సీతానగరంలో రామ్మోహన్‌రావు చిత్రపటానికి నివాళులర్పించిన నాయకులు

పెదపూడి: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్‌రావు ఆశయ సాధనకు అందరు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. రామ్మోహన్ జయంతి పురస్కరించుకొని పెదపూడి సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులు, పేదలకు పండ్లు, బ్రెడ్, దుప్పట్లు పంపిణీ చేశారు. ముందుగా ఆస్పత్రి సమీపంలో జక్కంపూడి చిత్రపటానికి సూర్యనారాయణరెడ్డి, పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రామ్మోహన్‌రావు హయంలో జిల్లాలో రహదారుల అభివృద్ధి విశేషంగా చేపట్టారన్నారు. అలాంటి నాయకుడిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి నల్లమిల్లి విజయ రెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గ బీసీ సెల్ కన్వీనర్ కేతా శ్రీను, మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్‌రావు జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. సీతానగరం మదర్ థెరిస్సా సెంటర్‌లో వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు ఆధ్వర్యంలో రామ్మోహన్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, అనంతరం కేక్ కట్ చేశారు. పేద విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పేదలకు దుస్తులను అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, సర్పంచ్ కోండ్రపు ముత్యాలు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వలవల వెంకట్రాజు, మాజీ ఎంపీపీ పెందుర్తి దేవదాసు, ఎంపీటీసీ వెన్నెల అప్పలనాయుడు, ఉపసర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. పురుషోత్తపట్నం, రామచంద్రపురంలో జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, వెలిశెటి మోహన్‌బాబా, శరత్, గద్దె వీరన్నబాబు, చింతలపూడి ముత్యాలరావు తదితరుల ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సింగవరంలో మట్ట శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ కుమ్మరశెట్టి వెంకటేశ్వరరావు, చీర్ల పోశియ్య, నాగేశ్వరరావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇనుగంటివారిపేటలో సర్పంచ్ సత్యం రాంపండు ఆధ్వర్యంలో రామ్మోహన్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. వైస్ ఎంపీపీ-2 సత్యం మదన్‌బాబు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. మండలంలోని పంచాయతీ గ్రామాల్లో దివంగత జక్కంపూడి జయంతి వేడుకలు ఆమా గ్రామాలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వంహించారు. పలు గ్రామాల్లో పేదలకు దుస్తులు అందించారు.



చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కోరుకొండ మండలంలో

కోరుకొండ మండల పరిధిలోని గ్రామాల్లో జక్కంపూడి రామ్మోహన్‌రావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బూరుగపూడిలో కంటి వినయ్ తేజ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మహిళలకు చీరలు, వృద్ధులకు నూతన వస్త్రాలు అందించారు.

మహిళలకు చీరలు పంపిణీ

కోరుకొండ (రాజానగరం): మండలంలోని కోరుకొండలో వైఎస్సార్ సీపీ నాయకుడు కంటే వినయ్ తేజ ఆధ్వర్యంలో దివంగత నేత, మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్‌రావు జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 50 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కంటే సత్తిబాబు, బుడ్డిగ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మియావాకీ పద్ధతే మేలైనది



మియావాకీ మొక్కల పెంపకాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

రాజానగరం: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా అకిరా మియావాకీ విధానంలో మొక్కల పెంపకం విశిష్టమైన ఆలోచనా విధానమని జిల్లా కలెక్టర్ ప్రశాంతి అన్నారు. రాజానగరంలో 25 సెంట్ల విస్తీర్ణంలో చేపట్టిన అకిరా మియావాకీ క్షేత్రంతోపాటు పామ్‌పాంట్, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను బుధవారం ఆమె పరిశీలించారు. సరైన వాతావరణంలో మొక్కల పెంపకాన్ని చేపట్టడం ద్వారా మెరుగైన ఫలితాలను పొందవచ్చన్నారు. లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విధానంలో మార్పులు తీసుకురావాలని సూచనలు చేశారు. అలాగే పొలం గట్లపై కూడా అకిరా మియావాకీ పద్ధతిలో మొక్కల పెంపకాన్ని చేపట్టేలా దృష్టిని సారించాలన్నారు. ఈ విధానంలో జామి, బిల్లా, మద్రి, నర్ర, గిలగిల, మద్ది, తామర, మందార, దేవాదారు, తులసి, వేప, గంధం, తగర వంటి 2,970 మొక్కలను నాటామని డ్వామా పీడీ నాగ మల్లేశ్వరరావు కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జేఏ ఝాన్సీ, తహసీల్దారు జీఏఎల్ఎస్ దేవి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్ పరిశీలన



వెలమపేటలోని అంగన్‌వాడీ సెంటర్ పరిశీలిస్తున్న ఎంపీపీ

సీతానగరం: మండలంలోని సీతానగరం పంచాయతీ పరిధిలో ఉన్న వెలమపేట అంగన్‌వాడీ సెంటర్-1 రికార్డులను ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న పరిశీలించారు. పిల్లలకు అందించే అహారాన్ని తనిఖీ చేసి అంగన్వాడీ వర్కర్ పద్మకు పలు సూచనలు అందించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, 12 మంది పిల్లలకు గాను 9 మంది పిల్లలు సెంటర్‌కు హాజరయ్యారని తెలిపారు. మెనూ ప్రకారం పిల్లలకు భోజనం అందిస్తున్నారన్నారు. బయట గోడలపై పిల్లలకు సంబంధించి బొమ్మలు వేయాల్సి ఉందని, అలాగే సెంటర్‌కు తాగునీటి సదుపాయం లేదన్నారు. పంచాయతీ వారు తాగునీటిని కనెక్షన్ ఇవ్వాల్సి ఉందని ఎంపీపీ తెలిపారు.

చెత్త సేకరణ బాధ్యతగా చేపట్టాలి



కరకుదురులో చెత్త సేకరణ పరిశీలిస్తున్న డీపీఆర్‌సీ బృందం

పెదపూడి: క్లాప్ మిత్రాలు గ్రామాల్లో చేపట్టే చెత్త సేకరణను బాధ్యతగా చేపట్టాలని డిప్యూటీ ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి అన్నారు. కరకుదురు గ్రామంలో బుధవారం జిల్లా పంచాయతీ రిసోర్సెస్ సెంటర్ సభ్యులు బృందం గ్రామంలో క్లాప్ మిత్రాల చెత్త సేకరణ, పారిశుధ్య పనులు పరిశీలించారు. ఈ బృందం సభ్యులు గ్రామంలో అన్ని వీధులు పరిశీలించి క్లాప్ మిత్రాలు చెత్త సేకరణ ఏ విధంగా చేస్తున్నారో, ప్రజలు ఏ విధంగా చెత్త క్లాప్ మిత్రాలకు అందిస్తున్నారో వివరాలు తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం నిర్వహించిన గ్రామ సభకు బృంద సభ్యులు జి.రాజ్‌కుమార్, కె.దావీదురాజ్, పి.రామకృష్ణ, కె.ఎల్.ఎస్.గణేష్, సీహెచ్.లక్ష్మణరావు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీవో కొవ్వూరు నరేందర్ రెడ్డి, సర్పంచ్ ఉండ్రు చంద్రకళ, సచివాలయం కార్యదర్శి సూర్యలక్ష్మి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బంగారు రూపులు అందజేత



మహిళలకు రూపులు ఇస్తున్న శ్రీనివాసరావు

రాజానగరం: శ్రావణమాసం సందర్భంగా విశ్వ హిందూ పరిరక్షణ, రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబారు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బంగారు వరలక్ష్మి కానుక లక్కీ డ్రా కార్యక్రమం బుధవారం రాజానగరంలో నిర్వహించారు. స్థానిక మాధవి ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి మహిళలు భారీగా తరలివచ్చారు. వారి నుంచి లక్కీ డ్రా తీసి, 200 మందికి బంగారు రూపులను బంగారు వరలక్ష్మి కానుకగా శ్రీనివాసరావు దంపతులు అందజేశారు.

విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి

కోరుకొండ (రాజానగరం): మండలంలోని మధురపూడిలో ప్రమాదవశాత్తు కరెంటు తీగలు తగలడంతో కోలమూరుకు చెందిన గ్రంధి శ్రీను (50) మృతి చెందాడు. వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న శ్రీను ఎప్పటిలాగే తన మోపెడ్‌పై పొలానికి వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. తెగిపడి ఉన్న విద్యుత్ తీగ అతడికి తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కోరుకొండ ఎస్సై నాగరాజు తెలిపారు.